ప్రజాశక్తి
సోమవారం 25 సెప్టెంబర్ 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి






# అవి దేవాలయ భూములే..!

◆ నిషేధిత జాబితాలో సర్వే నెంబర్ 115, 118/4, 120
◆ దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ ◆ మారేపల్లి లే అవుట్ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట
◆ 'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని దేవరాపల్లి మండలం మారేపల్లి సర్వే నెంబరు 115, 118/4, 120లో 40.25 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెడుతూ దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. ఎస్ఎఫ్ఎ, 1బి, 10(1) రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 115లో 23.15 ఎకరాలు, సర్వే నెంబర్ 118/4లో 6.25 ఎకరాలు, సర్వే నెంబర్ 120లో 10.85 ఎకరాలు మారేపల్లి శ్రీ రామాలయం భూమిగా నమోదు కావడంతో ఆ భూములు రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధిత జాబితాలో చేర్చారు.

సర్వే నెంబర్ 115లోని 23.15 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి లే అవుట్లు వేసి అమ్మినట్లు ఆరోపణలున్నాయి. భద్రాచలానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అధికార పార్టీ నాయకుల అండతో దేవాలయ భూముల్లో లే అవుట్లు వేసి విక్రయించాడు. అనుమతుల్లేకుండా కొండ కింది భాగాన్ని పేల్చి, ప్రభుత్వ భూమిలో 36 అడుగుల రోడ్డు నిర్మించినా రెవెన్యూ అధికారులు మౌనందాల్చారు. సర్వే నెంబరు 115లోని 23.15 ఎకరాల భూమి దేవాలయానికి చెందినదని అనకాపల్లి మిగతా 2లో..



దేవాలయ భూమిలోని లే అవుట్



ప్రజాశక్తి
శనివారం 23 జూలై 2022
కొండను తవ్వేస్తున్నారు



ప్రజాశక్తి
ఆదివారం 24 జూలై 2022
దేవాదాయ శాఖ మొద్దు నిద్ర
ఆక్రమణకు ఆమోద ముద్ర

ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనాలు

# ఉక్కు రక్షణకు బైకు ర్యాలీలు

## నిర్వాసిత కాలనీల్లో మార్మోగిన సేవ్ వైజాగ్ స్టీల్ నినాదం

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక (విశాఖపట్నం)

**ఈ నెల 20 నుంచి సిపిఎం ఆధ్వర్యాన ఉత్తరాంధ్రలో సాగుతున్న విశాఖ ఉక్కు రక్షణ బైకు యాత్రకు మద్దతుగా గాజువాక నియోజకవర్గంలో ఆదివారం పలు చోట్ల బైకు ర్యాలీలు నిర్వహి ంచారు. నిర్వాసిత కాలనీల్లో 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదం మార్మోగింది. పెద్ద సంఖ్యలో ఉక్కు కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.**



వడ్లపూడిలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఉక్కునగరంలోని రైతు బజార్ నుంచి బైకు ర్యాలీ ప్రారంభమై అన్ని సెక్టార్లలో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ తమ కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర జీవనాడి అయిన విశాఖ ఉక్కు కర్మాగారంపై కుట్రలు పన్నుతున్నా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 29న ఉక్కునగరంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరాజు, సీనియర్ నాయకులు రామారావు, ఐద్వా నాయకులు వేణు, స్టీల్ డివిజన్ సిపిఎం, సిఐటియు నాయకులు టి.చిరంజీవి, డిసిహెచ్. వెంకటేశ్వరరావు, పుల్లారావు, వి.ప్రసాద్, ఎస్‌కెకె. మొహిద్దిన్, కె.బాలశౌరి, కెపి.సుబ్రమణ్యం, బిఎన్.మధుసూదన్, కెవి.సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, శ్రీ రామచంద్రరావు, భానుమూర్తి పాల్గొన్నారు. కూర్మన్నపాలెంలో నిర్వహించిన బైకు ర్యాలీని నాయకులు కృష్ణారావు జెండా మిగతా 2లో..




ఉక్కునగరంలో నిర్వహించిన ర్యాలీలో గంగారావు

## కెకె లైన్‌లో విరిగిపడ్డ కొండచరియలు

▶ వార్త మెయిన్‌లో..

## వృద్ధురాలిపై బాలుడు అత్యాచారం

▶ వార్త మెయిన్‌లో..

## ఎస్ఎస్ఎం ఉద్యోగులపై నిర్బంధం

▶ వార్త 2లో..




మాట్లాడుతున్న ధీరజ్ సింగ్ ఠాకూర్

## దిగువ న్యాయస్థానాల్లో వచ్చే తీర్పులే కీలకం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ వార్త మెయిన్‌లో..

# గొప్ప మానవతావాది కొరటాల

## శత జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గొప్ప మానవతావాది, అధ్యయన శీలి కొరటాల సత్యనారాయణ అని పలువురు వక్తలు కొనియాడారు. సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కొరటాల సత్యనారాయణ శత జయంతి సభ విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జరిగింది. తొలుత కొరటాల చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు విఎస్.పద్మనాభరాజు, కొరటాల కుమారుడు రాధాకృష్ణ, మనవడు విష్ణు వర్ధన్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో అజశర్మ మాట్లాడుతూ కొరటాల అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించేవారని, తాను విశాఖ నగర కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆయనతో పనిచేసే అవకాశం దక్కిందని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం నాడు జరిగిన ఉద్యమంలో కొరటాల తన పదవిని మిగతా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులతో కలిసి తృణప్రాయంగా వదిలేసి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. కమ్యూనిజమే నిజమైన సిద్ధాంతమని నమ్మి కష్టజీవులకు అండగా తన యావజ్జీవితం నిలిచారన్నారు. ఆర్థిక క్రమశిక్షణగల నాయకుడని కొనియాడారు. విశాఖలో పంచ గ్రామాల భూ సమస్యపై నాడు ఏర్పాటైన కమిటీలో ద్రోణంరాజు మిగతా 2లో..



కొరటాల చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అజశర్మ, పద్మనాభరాజు, కొరటాల కుటుంబీకులు

## మొదటి పేజీ తరువాయి..

### అవి దేవాలయ భూములే..!

జిల్లా దేవాదాయశాఖాధికారి 2022 జూన్ 15న దేవరాపల్లి తహశీల్దార్‌కు లేఖ రాశారు. ఇవేమీ పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారి 23.15 ఎకరాల దేవాలయ భూమిని ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్, జి బ్లాకులుగా విభజించి 30 అడుగుల గ్రావెల్ రోడ్డు వేశాడు. వ్యవసాయేతర భూమి కింద పన్ను కట్టకుండా ఎగ్గొట్టేందుకు లే అవుట్‌ను అగ్రిఫాం కింద చూపించాడు. లే అవుట్‌ను వ్యవసాయ భూమిగా చూపించేందుకు శ్రీగంధం మొక్కలు, జామ మొక్కలు వేశాడు.

దేవాదాయ భూమిలో వేసిన లే అవుట్‌ను క్షేత్రస్థాయిలో అడ్డుకొనే ప్రయత్నం దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖాధికారులెవరూ చేయలేదు. దేవాదాయ భూమిలో లే అవుట్ వేసిన విషయం సిపిఎం ఫిర్యాదుతో వెలుగు చూసింది. 115 సర్వే నెంబర్‌లోని 23.15 ఎకరాల దేవాలయ భూమిని స్వాధీనం చేసుకోవాలని దేవాదాయ శాఖాధికారులు, రెవెన్యూ అధికారులకు నాడు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 115లోని 23.15 ఎకరాల దేవాలయ భూమిలో లే అవుట్ వేయడంపై 2022 జులై 23న ప్రజాశక్తి 'కొండను తవ్వేస్తున్నారు' శీర్షికన, 2022 జులై 24న 'దేవాదాయ శాఖ మొద్దునిద్ర, ఆక్రమణకు ఆమోద ముద్ర' శీర్షికన కథనాలు ఇచ్చింది. దీంతో దేవాదాయ శాఖలో కదలిక వచ్చింది. రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి వేసిన లే అవుట్ దేవాదాయ భూమి అని గుర్తించింది. ఆ భూములు రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధిత జాబితాలో చేర్చింది. మారేపల్లి సర్వే నెంబర్ 115, 118/4, 120లో 40.25 ఎకరాల భూమిని 22ఎ(1)సిలో చేర్చుతూ దేవాదాయ శాఖ కమిషనర్ సెప్టెంబరు 15న జారీ చేసిన ఉత్తర్వుల కాపీ దేవాదాయ శాఖ విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్‌కు, అనకాపల్లి జిల్లా దేవాదాయశాఖాధికారికి పంపారు. సర్వే నెంబర్ 115, 118/4, 120లో 40.25 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చుతూ దేవాదాయశాఖ కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులు అందాయని కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

**ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలి**



దేవరాపల్లి మండలం, మారేపల్లి సర్వే నెంబర్ 115, 118/4, 120లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చుతూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయం. సర్వే నెంబర్ 115లోని 23.15 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు దేవాదాయ శాఖ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదుచేశాం. నిషేధిత జాబితాలోని ఇప్పటికే జరిగిన భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. ఆక్రమణలకు గురైన దేవాదాయ శాఖ భూమిని స్వాధీనం చేసుకోవాలి. దేవాదాయ భూమిలో లే అవుట్ వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

**డి.వెంకన్న, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు**

### గొప్ప మానవతావాది కొరటాల

సత్యనారాయణ, ఎం.సత్య నారాయణలతో కలిసి ఉన్నారన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు వివిఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ రైతాంగ, వ్యవసాయ సమస్యల అధ్యయనంలో కొరటాలది అందెవేసిన చేయి అన్నారు. ప్రజాశక్తి దినపత్రిక వ్యవస్థాపక ఛైర్మన్‌గా కొరటాల పనిచేస్తూనే తన తుదిశ్వాస వరకూ విప్లవోద్యమంలో కృషిని కొనసాగించారన్నారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ కొరటాల జీవితం చాలా విలక్షణమైనదన్నారు. హైస్కూలు దశలోనే విద్యార్థులను ఏకం చేసి సమస్యలపై పోరాడిన యోధుడన్నారు.

**కొరటాల ఆశయాలతో ముందుకెళ్లడం అభినందనీయం**

కొరటాల సత్యనారాయణ కుమారుడు రాధాకృష్ణ మాట్లాడుతూ నాన్నగారి ఆశయాలతో నేటి తరం నాయకులంతా ముందుకెళ్లడం తనకెంతో ఆనందాన్నిస్తోందని అన్నారు. కొరటాల మనవడు విష్ణువర్ధన్ మాట్లాడుతూ తాతగారు ఆఖరి క్షణాల్లో తనతో పలు పుస్తకాలు చదివించుకోవడం తనకెంతో ఆనందకరమైన విషయమని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు, రాజు పాల్గొన్నారు. పార్టీ సీనియర్ సభ్యులు సిఎన్.బాబు కొరటాలతో అనుబంధాన్ని వేదికపై వివరించారు.

**విశాఖపట్నం :** ఆటోనగర్‌లోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో కొరటాల చిత్రపటానికి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాశక్తి అభివృద్ధిలో కొరటాల కీలకపాత్ర పోషించారన్నారు. ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

### 'సిల్వర్ ఓక్స్ స్ట్రీట్ స్టోర్'కు స్పందన

ప్రజాశక్తి - **ఎంవిపి.కాలనీ :** వినూత్న బోధన, స్వదేశీ పరిశోధన పద్ధతిన 22 ఏళ్లుగా నడుస్తున్న సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో రుషికొండ గీతం పక్కన సిల్వర్ ఓక్స్ స్ట్రీట్ స్టోర్' పేరిట ఛారిటబుల్ పాప్ అప్ ఈవెంట్‌ను నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. ఈ స్టోర్ల నుంచి నిరుపేదలు తమకు కావాల్సిన వస్తువులను తీసుకెళ్లారు. ఆ వస్తువులను తీసుకెళ్లేటప్పుడు వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.



వస్తువులు తీసుకుంటున్న పేదలు

# జ్వరాలపై అప్రమత్తంగా ఉన్నాం

**ఈ ఏడాది 399 మంది క్షేత్ర స్థాయి మలేరియా సిబ్బంది నియామకం**
**నీటి కుంటల్లో గంభూషియా చేపల ప్రణాళిక అమలుకు కృషి**
**- 'ప్రజాశక్తి'తో జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కుమార్**



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నగరంలో డెంగీ, మలేరియా, ఇతర సీజనల్ జ్వరాలు అనేక ప్రాంతాల్లో ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తగు జాగ్రత్తలతో జ్వరాల నివారణకు ఎక్కడికక్కడ వైద్య సిబ్బంది సూచనలు, సలహాలు ఇస్తూ వైద్య సహాయం అందజేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లా మలేరియా విభాగం, జివిఎంసి వైద్య సిబ్బంది సమన్వయం, పరస్పర సహాయ సహకారాలతో సీజనల్ వ్యాధులపై పలు చర్యలు చేపడుతున్నాం' అని జివిఎంసి చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ నరేష్ కుమార్ అన్నారు. జ్వరాల నియంత్రణకు జివిఎంసి పరిధిలో చేపడుతున్న చర్యలను ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**మలేరియా, డెంగీ కేసులు తీవ్రమవుతున్న నేపథ్యంలో నివారణకు ఏం చర్యలు చేపడుతున్నారు ?**

సీజనల్ వ్యాధులైన డెంగీ, చికెన్ గున్యాల నివారణకు పలు చర్యలు తీసుకుంటున్నాం.. 2023 జనవరి నుంచి సెప్టెంబర్ వరకూ 74 మలేరియా కేసులు, 720 డెంగీ కేసులు, 2 చికెన్ గున్యా కేసులు నగరంలో నమోదయ్యాయి. రోజువారీ ప్రణాళికలతో వీటి నివారణకు వెళుతున్నాం. ఉన్నతాధికారులు, ముఖ్యంగా జిల్లా మలేరియా కార్యాలయ అధికారుల సూచనలను అమలు చేస్తున్నాం.

**తీసుకుంటున్న చర్యలేమిటి ?**

జివిఎంసి పరిధిలో యాంటీ లార్వాల్ ఆపరేషన్స్ చేపడుతున్నాం. ప్రతి ఇంటికీ వెళ్లి దోమల లార్వాలను గుర్తించి నిర్మూలిస్తున్నాం. ఫాగింగ్ ఆపరేషన్స్, నిల్వ నీరు, పల్లపు నీటి ప్రాంతాల్లో లార్వా నిర్మూలన కోసం ఎంఎల్ ఆయిల్ బాల్స్ విడుదల చేస్తున్నాం. సమాచార ప్రచార మాధ్యమాల ద్వారా నగరంలో అన్ని వార్డుల్లోనూ ప్రచారం చేపట్టాం. కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన




కల్పించడంతో పాటు ప్రతి మంగళవారం ఓవర్ హెడ్ ట్యాంక్‌ల తనిఖీలు చేపడుతున్నాం. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమల ఉత్పత్తి జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం.

**సిబ్బంది తగినంత ఉన్నారా ?**

ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే'గా ప్రజలు పాటించేలా అవగాహన కల్పిస్తున్నాం. సచివాలయాల పరిధిలోనూ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న సిబ్బంది క్షేత్రస్థాయిలో సరిపోవడం లేదు. ఈ ఏడాది డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణ కోసం 399 మంది సీజనల్ మలేరియా క్షేత్రస్థాయి సిబ్బందిని ఎంగేజ్ చేసే పనిలో నిమగ్నమయ్యాం. ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. జివిఎంసి కమిషనర్ ఆదేశాల ప్రకారం ఈ సీజన్‌లో 20 లక్షల గంభూషియా చేపలను నీటి ఆవాసాల్లో వేయనున్నాం. ఇప్పటికే 7130 నీటి ఆవాసాల్లో ఐదు లక్షల గంభూషియా చేపలను విడుదల చేశాం. ఇంకా గంభూషియా చేపల ప్రణాళికను అమలు చేసే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

# ఎస్ఎస్ఎ ఉద్యోగులపై నిర్బంధం



గొలుగొండలో పోలీసు నిర్బంధంలో ఉన్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. పెండింగ్ జీతాలు చెల్లించాలని, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఎ ఉద్యోగుల జెఎసి సోమవారం విజయవాడలో సత్యాగ్రహ దీక్షకు పిలుపునిచ్చింది. ఆ దీక్షకు అనకాపల్లి జిల్లా నుంచి వెళ్తున్న ఉద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. చీడికాడ, గొలుగొండ మండలాల్లో శనివారం నుంచి గృహ నిర్బంధాలు చేశారు. కార్యాలయాలకు వెళ్లి ఫోన్లు తీసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు రావాలని ఒత్తిడి తెచ్చారు. జిల్లాలో 11 మండలాల్లో ఎస్ఎస్ఎ ఉద్యోగులను విజయవాడ వెళ్లకుండా పోలీసులు ఇళ్ల వద్ద అడ్డుకున్నారు. కొన్నిచోట్ల పోలీసు స్టేషన్‌కు రప్పించి నిర్బంధించారు.

**ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి**

ఎస్ఎస్ఎ ఉద్యోగులను సత్యాగ్రహ దీక్షకు వెళ్లకుండా నిర్బంధించడం సరికాదు. గతంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేయాలి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. అరెస్టు చేసిన వారిని విడిచిపెట్టాలి.

**వివి.శ్రీనివాసరావు, ఎపి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య జెఎసి ఛైర్మన్, అనకాపల్లి జిల్లా**

# ఉక్కు రక్షణకు బైకు ర్యాలీలు

**(మొదటి పేజీ తరువాయి..)** ఊపి ప్రారంభించారు. వడ్లపూడిలో జరిగిన బైకు ర్యాలీని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ ఆరంభించి మాట్లాడారు. ఐక్య పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు.

పెదగంట్యాడ పరిధిలో హౌసింగ్ బోర్డు సిడబ్ల్యుసి భవనం వద్ద బైకు ర్యాలీ ప్రారంభమై చిన కోరాడ, పెదకోరాడ, సీతానగరం, నడుపూరు, సిద్ధేశ్వరం, అయ్యన్నపాలెం, నెల్లిముక్కు ఏరియాల్లో సాగింది. సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.రామారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో పాల అప్పలరెడ్డి, కొండ శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి గురప్ప, కొవిరి అప్పలరాజు, సిహెచ్.రాముడు, అప్పారావు, శ్రీనివాసరెడ్డి, డి.వెంకటరావు పాల్గొన్నారు.

**904వ రోజుకు దీక్షలు**

**కలెక్టరేట్ :** స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారానికి 904వ రోజుకు చేరాయి. దీక్షల్లో హిందూజా ఫార్మా కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి హిందూజా ఫార్మా నాయకులు, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడారు. కార్యక్రమంలో కె.సత్యాంజనేయ, చుక్క శ్రీను, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

### వైజాగ్ బే మారథాన్ విజయవంతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కిన్లీ వైజాగ్ బే మారథాన్ ఆరో ఎడిషన్ ఆదివారం విజయవంతమైంది. ముఖ్య అతిథులుగా వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి, పోలీస్ కమిషనర్ రవిశంకర్ హాజరై మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. 21 కె (హాఫ్ మారథాన్), 10 కె, 3కె, 5కె విభాగాల్లో మారథాన్ సాగింది. 9 వేల మంది పాల్గొన్నారు.




మారథాన్‌ను ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి



నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

## శాస్త్రీయ, జానపద నృత్యాలు

ప్రజాశక్తి- పిఎం.పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో సిద్ధేంద్రయోగి నాట్యాలయంచే శాస్త్రీయ, జానపద నృత్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహా గణపతిం మనసా స్మరామి, భావంలోన బాహ్యం నందున, గోపికమ్మా చాలు నీ నిదుర, మధుర పూరి మధు వదన, హర హర మహాదేవ, మొక్కు జొన్న తోటలో, వాదినకు ఒకసారి, గాజుల సవ్వడి, కోయిలారే తదితర అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి సిహెచ్ మోహనలక్ష్మి నృత్య దర్శకత్వం వహించగా రిషిత, హర్షిత, శ్రావణి, విజయ లక్ష్మి, ప్రియాంక, శాన్వి, కీర్తి, యశస్విని, దామిని, యోషిత, నవ్య, సౌజన్య, స్రవంతి, సంధ్య, మౌనిక, రఘువ కళాకారులు నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సింహాచలం : శ్రీ వరహా లక్ష్మీనరసింహ వాకర్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం అప్పన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ జగదీష్, డాక్టర్ భాను ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు జరిపి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వ్యాయామంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలు వివరించారు.



పద్మనాభం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సిపి రవిశంకర్ అయ్యనార్

## పద్మనాభం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిపి

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం పోలీస్‌స్టేషన్‌ను విశాఖ నగర కమిషనర్ రవిశంకర్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. సిఐ ఎం.సన్యాసినాయుడు ఆధ్వర్యాన ఫైళ్లను పరిశీలించారు. సిపిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన పరిధిలో ఉన్న స్టేషన్లను పరిశీలించి, క్రైమ్ రేటును తెలుసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

## అడవివరం పిఎసిఎస్ మహాజన సభ

ప్రజాశక్తి-సింహాచలం: అడవివరం సహకార పరపతి సంఘం మహాజనసభను ఆదివారం నిర్వహించారు. 2023- 24 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలను సభలో సభ్యుల ముందు ఉంచారు. మొండిబకాయిలపై కఠినంగా వ్యవహరిస్తామని సంఘ అధ్యక్షులు స్పష్టంచేశారు. ఈ సమావేశంలో పాలక మండలి సభ్యులు బంటుపల్లి మహేష్, గురునాథ్, కోరాడ ఈశ్వరరావు, లండ వెంకటరమణ, మజ్జి ధర్మారావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి జోన్- 2 పరిధిలో సిఐటియు అనుబంధంగా శ్రీకృష్ణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఏర్పాటైంది. కొమ్మాది కూడలిలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సంఘం విధివిధానాలను రూపొందించుకొని, కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులు, సలహాదారులుగా సిఐటియు నాయకులు పి.రాజుకుమార్, ఎ.నీలయ్య, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎ.లక్ష్మణరావు, కె.రమణ, కార్యదర్శులుగా ఎం.సత్యం, ఎస్.రమణ, కోశాధికారిగా కె.లక్ష్మణ, కమిటీ సభ్యులుగా ఎ.నరసింగరావు, కె.చిన్నప్పన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంతో పాటు వారి హక్కుల కోసం సంఘం నిలబడాలని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.



సమావేశమైన భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు, సిఐటియు నాయకులు

వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యంచేసిందన్నారు. సంక్షేమ బోర్డు నిధులు వెనక్కి తెచ్చుకునేందుకు చేసే పోరాటాల్లో సంఘ సభ్యులు భాగస్వామ్యం కావాలని కోరారు. వీటితో పాటు ప్రజా హిత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.ధనుంజయ, జి.అప్పలనరసయ్య, ఎం.శ్రీను, జి.భద్రయ్య, ఎస్.శంకర్, వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య వృత్తి పవిత్రమైనది : సిపి



సభలో మాట్లాడుతున్న సిపి రవిశంకర్ అయ్యనార్

ప్రజాశక్తి -తగరపువలస : వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ పేర్కొన్నారు. స్థానిక సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే తరానికి ఉపయోగ పడేలా సేవలు ఉండాలని సూచించారు. పరిశోధనతో కూడిన విద్య ద్వారా వైద్యవృత్తికి, తద్వారా వ్యక్తిత్వానికి వన్నె తేవాలని సూచించారు. ర్యాగింగ్, డ్రగ్స్‌కు ఆమడ దూరంలో ఉండాలని స్పష్టం చేశారు. కళాశాల డీన్ సుధాకర్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, పరిశోధన పట్ల ఆశక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల యాజమాన్యం తరుపున రిటైర్డ్ డిజిపి ఎన్ఆర్‌కె.రెడ్డి, కె.బాపిరెడ్డి, సిఇఒ నిరంజన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి తమ ప్రసంగాల్లో కళాశాల ప్రగతిని వివరించారు. వార్షిక యూనివర్సిటీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. ఎఒ శివప్రసాద్, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# సూర్యనారాయణ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెం గ్రామానికి చెందిన మండల ఉపాధ్యక్షులు పాండ్రంకి శ్రీను పెదనాన్న, వైసిపి సీనియర్ నాయకులు కోరాడ ముసలినాయుడు తండ్రి కోరాడ సూర్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, పలువురు నాయకులు, స్నేహితులు, బంధువులు కోరాడ సూర్యనారాయణ (65) భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, సర్పంచులు కలిమి గంగరాజు, బిఆర్‌బి నాయుడు, బలిరెడ్డి మల్లికార్జునరావు,



సూర్యనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించిన నాయకులు

మహంతి వెంకటలక్ష్మి శివాజీ, శినగం ఎర్రయ్య, మండల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు సూర్యనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ఉత్సాహంగా గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు



గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో క్రీడాకారులు

ప్రజాశక్తి- పిఎం.పాలెం : చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వేదికగా ఆదివారం గ్రాప్లింగ్ విశాఖ జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యాన 3వ ఏపీ రాష్ట్ర జూనియర్స్, సీనియర్స్ బాల, బాలికల గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను విశ్రాంత అదనపు ఎస్‌పి టిఎస్ఆర్.ప్రసాద్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి, సిఐ బాలకృష్ణ, ఏపీ గ్రాప్లింగ్ అసోషియేషన్ అధ్యక్షులు ఎం.సురేంద్రరెడ్డి, కార్యదర్శి డి.సాయిసుమతి, జిల్లా అధ్యక్షులు బగాది జగదీశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఎం.రాజబాబు, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ బుదుమూరి మీనా, పోతినప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ పెంకోటరాములు ప్రారంభించారు. ఏపీ గ్రాప్లింగ్ అసోషియేషన్ నిర్వహణ కార్యదర్శి పేడాడ మురళీ నేతృత్వంలో హాజరత్ ముఖ్తియార్ అలీ ఆశ్రమ వ్యవస్థాపకులు డాక్టర్ ఎమ్‌డి అహ్మద్ ఆర్థిక సహకారంతో పోటీలు నిర్వహించారు.

## నేరాలు ఘోరాలు

## టీసీ విషయమై హెచ్‌ఎంతో ఘర్షణ

### మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బదిలీ సర్టిఫికెట్ జారీలో జాప్యంతో హెచ్‌ఎంతో ఘర్షణ నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం అర్ధరాత్రి పూడిమడక శివారు కడపాలెంలో చోటుచేసుకుంది. ఘటనపై విద్యార్థి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. జిల్లా ఎస్‌పి, ఇతర అధికారులు ఘటనపై ఆరా తీస్తున్నారు. దీనిపై సేకరించిన వివరాలివి.

పూడిమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న దానయ్య, బదిలీ సర్టిఫికెట్ కోసం హెచ్‌ఎంకు దరఖాస్తు చేశాడు. అయితే టిసిజారీలో జాప్యంపై హెచ్‌ఎం రామశేషుతో ఘర్షణ జరగ్గా, ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విద్యార్థి దానయ్య ఇంటికి వెళ్లిన పోలీసులు, అతనిని స్టేషన్‌కు రప్పించి, మందలించి, 41ఎ నోటీసు ఇచ్చి ఇంటికి పంపించారు. తనపై పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టడం, పోలీసులు విచారించడం, మందలించడంతో మనస్తాపానికి గురైన దానయ్య శనివారం అర్ధరాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని చనిపోయాడు. కుమారుడు చనిపోయిన విషయాన్నితల్లి ధనమ్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్న దానయ్య మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కాగా విద్యార్థి దానయ్య మృతిపై సమగ్ర విచారణ చేసి, న్యాయం చేయాలని గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు స్టేషనుకు తరలి వచ్చారు. దానయ్య మృతికి కారకుడైన ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసును అచ్యుతాపురం సిఐ మురళీరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సన్యాసినాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

**విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ : ఎస్‌పి మురళీకృష్ణ**

పూడిమడకలో ఉరేసుకుని విద్యార్థి మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ చేపడతామని జిల్లా ఎస్‌పి డాక్టర్ కెవి.మురళీకృష్ణ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం అచ్యుతాపురం పోలీస్ స్టేషనును సందర్శించారు. విద్యార్థి మృతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, జరిగిన ఘటన, విద్యార్థి మృతిపై లోతైన విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. డిఎస్‌పి పి.శ్రీనివాసరావు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున హనుమంతువాక కూడలి వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన పైడి శ్రీను (23) తన సోదరుడు మచ్చ రాజేష్‌తో కలిసి ఆదివారం ఉదయం 5.30 గంటలకు రైల్వే స్టేషన్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా హనుమంతువాక సిగ్నల్ కూడలి వద్ద నగరం వైపు మలుపు తిరుగుతుండగా జూ పార్కు వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. పైడి శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. రాజేష్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. సిఐ సోమశేఖర్ ఆధ్వర్యాన ఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని మూలకుద్దు గోస్తనీ పరీవాహక ప్రాంతంలో ముళ్ల పొదల్లో సుమారు 42 నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఆదివారం లభ్యమైంది. మతుడు నాచు రంగు షర్ట్, ఆఫ్ నిక్కరు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 93 వార్డు పరిధి బాలాజీ గార్డెన్‌లో ఇంట్లో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మృతురాలు రాధా గాయత్రి (45) బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. రాధాగాయత్రి భర్త గుంటూరు సమీపంలోని స్వగ్రామానికి మంగళవారం వెళ్లారు. బ్యూటీషియన్‌గా పనిచేస్తున్న మరో మహిళ రాధాగాయత్రికి శుక్రవారం నుంచి ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయకపోవడంతో ఆమె ఆదివారం ఆ ఇంటికి వెళ్లింది. కిటికీ లోంచి చూడగా రాధాగాయత్రి కిందపడిపోయి మృతిచెంది ఉంది. చూసేందుకు వెళ్లిన మహిళ కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని స్థానికులను విచారిస్తున్నారు.



జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున

## హైకోర్టు సిజెకు కలెక్టర్ స్వాగతం

**ప్రజాశక్తి-లీగల్ :** నూతన న్యాయస్థానాల సముదాయం ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్వాగతం పలికారు. న్యాయస్థానం సమముదాయం దగ్గర జస్టిస్ ఠాకూర్‌కు కోర్టు సముదాయం నిర్మాణానికి సంబంధించిన పలు విషయాలను వివరించారు.

## చంద్రయాన్ 3 వినాయక మండపాన్ని సందర్శించిన మాజీ మంత్రి గంటా





చంద్రయాన్-3 వినాయక మండపాన్ని సందర్శించిన గంటా

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక కీటిన్‌పేటలో యువకులు నెలకొల్పిన చంద్రయాన్ 3 వినాయక మండపాన్ని మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం సందర్శించారు. చంద్రయాన్-3 నమూనాలో వినాయక మండపం ఏర్పాటు చేయాలన్న ఆలోచన రావడం అభినందనీయమని స్థానిక యువకులను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, సీనియర్ నాయకులు యరబాల అనిల్‌ప్రసాద్, మాజీ కౌన్సిలర్ గొలగాని నరేంద్రకుమార్, జివిఎంసి 4వ వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ కేంద్రానికి గంటా దంపతుల వితరణ

**ప్రజాశక్తి -తగరపువలస :** భీమిలి మండలం, తాళ్ళవలసలో భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రాన్ని మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మె ల్యే గంటా శ్రీనివాసరావు దంపతులు ఆదివారం సందర్శించారు. కేంద్రంలో ఉన్న పిల్లలకు మధ్యాహ్న భోజనం, దుస్తులు, క్రీడా షూస్ అందజేశారు. సంస్థ నిర్వాహకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## పిఎసిఎస్ భవనాన్ని కాపాడాలని వినతి

**ప్రజాశక్తి -మధురవాడ :** ఇటీవల నూతనంగా నిర్మించిన మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్) భవన సముదాయం కూల్చివేసి ఆ స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మించాలని సహకార శాఖ అధికారులు చేస్తున్న ప్రతిపాదనలు అడ్డుకోవాలని కోరుతూ సంఘ సభ్యులు, అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ మాట్లాడారు. ఫోన్‌లో జిల్లా డిసిఒతో మాట్లాడి సంఘానికి నష్టం కలిగించే ఎటువంటి ప్రతిపాదనలూ చెయ్యరాదని ఆదేశించారు.

## 'జిఒ 301 గడువు పెంచాలి'

**ప్రజాశక్తి -గాజువాక :** గాజువాక హౌస్ కమిటీకి సంబంధించిన జిఒ 301 గడువు మరో రెండు నెలలు పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి కోరారు. దీని గడువు ఈ నెల 27వ తేదీతో ముగుస్తుందని, వాస్తవానికి 7000 పట్టాలకు 2500 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ జరిగాయని తెలిపారు. మిగిలిన వారివి పట్టాల్లో కొన్ని తప్పులు ఉన్నాయని, వారిని సరిచేసుకునేందుకు చూస్తున్నారని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని గడువు పెంచాలని కోరారు.

# కలగా గాజువాక స్పోర్ట్స్ కాంప్లెక్స్

### ఎమ్మెల్యేలు మారుతున్నా నెరవేరని వైనం..

**ప్రజాశక్తి -గాజువాక :** గాజువాక నియోజకవర్గ పరిధి ఉడా కాలనీని ఆనుకొని ఉన్న ఏడెకరాల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం పెందుర్తి నియోజకవర్గంలో ఈ ప్రాంతమున్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే గణబాబు శంకుస్థాపన చేశారు. పెందుర్తి నియోజకవర్గం నుంచే ఎమ్మెల్యేగా గెలిచిన తిప్పల గురుమూర్తిరెడ్డి కూడా 2004లో మరోసారి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత నియోజకవర్గం మారింది. గాజువాక నియోజకవర్గం అయింది. శంకుస్థాపన తర్వాత ఐదుగురు ఎమ్మెల్యేలు మారారు. అయినా సరే గాజువాక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఒక్క అడుగు ముందుకు పడలేదు. క్రీడామంత్రిగా పనిచేసిన సమయంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు గాజువాక వచ్చి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కానీ పురోగతీ లేదు. గాజువాకలో ఇంత పెద్ద స్థలం మరెక్కడా లేదు. క్రీడాకారులు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దీనిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా నిర్మిస్తే గాజువాకలో ఉన్న క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



2004లో గురుమూర్తిరెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం



స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్న స్థలం

2004వ సంవత్సరంలో హెచ్‌పిసిఎల్ యాజమాన్యం సిఎస్ఆర్ కింద రూ.7 కోట్లు కేటాయించింది. పనులు ప్రారంభించకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లాయి. ఇది ఒక ఎన్నికల హామీగా నేతలకు ఉపయోగపడుతుంది తప్ప ప్రజలకు ప్రయోజనం కనిపించడంలేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరాజు



ఉక్కు దీక్షలో పాల్గొన్న సిఐటియు కాంట్రాక్టు కార్మికులు

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వం చేసినది రాజకీయ నిర్ణయమని, దానిని రాజకీయంగానే తిప్పికొట్టాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ పూర్వ గౌరవాధ్యక్షులు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 955వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ అధ్యక్షతన కార్మికులు కూర్చున్నారు. శిబిరాన్ని ఉద్దేశించి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, 955 రోజులుగా స్టీల్ కార్మికవర్గం చేస్తున్న పోరాటం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరణకు ఒక్క అడుగు ముందుకు వేయకుండా అడ్డుకోగలిగామన్నారు. రాష్ట్ర ప్రజానీకం ద్వారా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవాలని, రాబోయే ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడానికి చిత్తశుద్ధితో నిలబడిన వారికే భవిష్యత్తు అన్న విధంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. భారత్ బచావో సంస్థ ప్రతినిధులు శిబిరానికి వచ్చి పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఆప్ ప్రతినిధులు శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో టిపిపి కాంట్రాక్టు కార్మికులతోపాటు నాయకులు ఒ.వి.రావు, ఎ.శ్రీనివాస్, ఆర్‌టి.రాజు, బండి అప్పలరాజు పాల్గొన్నారు. పోరాటకమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్, నీరుకొండ రామచంద్రరావు, ఎ.వల్లీ, శరత్, బొడ్డు పైడిరాజు శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

# సమస్యలపై జాతీయ ఎస్‌టి కమిషన్‌తో చర్చలు

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** విశాఖ వచ్చిన జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ మెంబర్ అనంత నాయక్, డిప్యూటీ సెక్రటరీ తౌతంగా, డైరెక్టర్ జయంత్ జె సరోడ్ త్రిపాఠి, మిశ్రా, పరీడతో స్టీల్ ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రతినిధులు సమావేశం నోవాటెల్ హోటల్‌లో సమావేశమయ్యారు. స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం వల్ల నష్టాలు వస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒడిశా రాష్ట్రంలో ఉన్న గనులను కేటాయించేలా కృషిచేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో ఉంటేనే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లు దక్కుతాయని, దీని కోసం సంస్థను ప్రయివేటీకరణ కాకుండా చూడాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ వర్క్స్ డివిజన్‌లో 52 హెచ్‌ఒడిల్లో ఒక్క ఎస్‌టి కూడా లేరని, ప్రస్తుతం చీఫ్ జనరల్ మేనేజర్ పోస్టులో ఒక్క ఎస్‌టి అభ్యర్థి లేరని వివరించారు. జూనియర్ ఆఫీసర్ నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ నోషనల్ సీనియారిటీ బాధిత ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు భవిష్యత్తులో ఇచ్చే ప్రమోషన్లలో ప్రాధాన్యత కల్పించి తగు న్యాయం చేయాలని కోరారు. ఉక్కునగరంలో ఉన్న ఏకైక ట్రైబల్ ఏకలవ్య పార్కును అభివృద్ధిపరిచి, అక్కడ ఏకలవ్య, బిర్సా ముండా, కొమరం భీమ్ విగ్రహాలను నెలకొల్పేలా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 7.3 మిలియన్ టన్ కెపాసిటీ ప్లాంట్‌కు ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులు సుమారు 4700 మంది ఉండాల్సి ఉండగా, నేడు 3200 మంది మాత్రమే ఉన్నారని, తక్షణమే ఉద్యోగ నియమకాలు చేపట్టే విధంగా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఛార్జ్ మెన్ నుంచి జూనియర్ ఆఫీసర్ టెస్ట్ నిర్వహించి వెంటనే ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఐదేళ్లుగా ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులు ఎగ్జిక్యూటివ్‌లకు ప్రమోషన్స్ ఇవ్వకపోవడంతో అలాగే ఉద్యోగ విరమణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంట్రాక్టు ఉద్యోగ నియమకాల్లో ఎస్‌సి, ఎస్‌టి నిరుద్యోగులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. దీనిపై కమిషన్ నెంబర్ అనంత నాయక్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సమస్యలపై స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ బట్, సిజిఎం గద్దె గాంధీ, జిఎం హెచ్‌ఆర్ ఐఆర్ కంచర్ల సంజీవరావు, ఎస్‌సి, ఎస్‌టి లైజన్ ఆఫీసర్ వి.తిరుపతిరావు తదితర స్టీల్‌ప్లాంట్ అధికారులతో కమిషన్ సమావేశమై, సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కమిషన్ సభ్యులను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎల్‌వి.రమణారావు, కోశాధికారి కెవి.రత్నం, మోరి గణేష్, పుల్లారావు, వేణుగోపాలరావు, కార్యదర్శులు ఎస్.మోహన్‌బాబు, లక్ష్మణమూర్తి, దాసరి అప్పారావు, బంజ కిషోర్ సింగ్, ఫణీంద్ర బాబు, బిడి.నాయక్ తదితరులు ఉన్నారు.

## అయోధ్యరామ్‌కు మాతృవియోగం



**ప్రజాశక్తి-ఉక్కునగరం :** స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాతృమూర్తి సీతా మహాలక్ష్మి ఆదివారం ఉదయం దేవరాపల్లిలో కన్నుమూశారు. ఆమె మృతి వార్త తెలుసుకున్న స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పలువురు కార్మిక నేతలు ఆమెకు నివాళు లర్పించారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, ప్రజానాట్యమండలి సభ్యులు కె.సత్యనారాయణ, ఐద్వా నాయకులు సుభాషిణి, వేణు నివాళులర్పించారు.

## పరారీలో ఉన్న నిందితుని ఆచూకీ తెలపండి

**ప్రజాశక్తి -మధురవాడ :** ఏళ్ల తరబడి పరారీలో ఉన్న నిందితుడి ఆచూకీ తెలపాలని పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ కోరారు. విజయవాడ టైలర్‌పేటకు చెందిన చెన్న పవన్‌కుమార్ దొంగ నోట్ల కేసులో నిందితుడుగా ఉన్నాడని తెలిపారు. గతంలో నిందితులను పిఎం.పాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. బెయిల్‌పై వచ్చిన నిందితుడు 9 ఏళ్ల నుంచి కోర్టుకు హాజరు కాకుండా పరారీలో ఉన్నాడని వివరించారు. నిందితుని వివరాలు తెలిస్తే పిఎం.పాలెం సిఐ 9440796060 నెంబర్‌కు సమాచారం అందించాలని సిఐ కోరారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ

**ప్రజాశక్తి -తగరపువలస :** స్థానిక ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణా తరగతులకు వస్తున్న సుమారు వంద మంది విద్యార్థులకు ఆదివారం చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన రూ.20 వేలు విలువ కలిగిన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కెఎస్ఎం.సుధాకర్, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.ఆనంద్, చైర్మన్ సుహాసిని, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు గంటాన మోహనరావు, అధ్యక్షులు దత్తి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, పి.నాగేశ్వరరావు, ఎల్ఎ శ్రీనివాసరావు, దత్తి రవికుమార్ పాల్గొన్నారు



'వాక్ ఫర్ స్టీల్‌ప్లాంట్'లో పాల్గొన్న సిపిఎం నేతలు

# ఉక్కు పరిరక్షణ అందరి బాధ్యత

## 'వాక్ ఫర్ స్టీల్‌ప్లాంట్'లో సిపిఎం నేతలు ... బైక్‌యాత్ర జయప్రదానికి ప్రచారం

**ప్రజాశక్తి -అనకాపల్లి :** ఆంధ్రుల హక్కు, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రుత్తల శంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో 'సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్' పేరుతో రింగ్ రోడ్డు నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు వాక్ ఫర్ స్టీల్‌ప్లాంట్ నిర్వహించారు. సిపిఎం ఆధ్వర్యంలో ఉక్కు రక్షణ బైక్‌యాత్ర ఈనెల 27న బుధవారం సాయంత్రం 5.30గంటలకు అనకాపల్లి చేరుకుంటుందన్నారు. ఈ బైక్ యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ ఈ వాక్ నిర్వహించామన్నారు. 32మంది ప్రాణత్యాగాలతో ఆవిర్భవించిన స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజలందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, మండల కమిటీ సభ్యులు ఎం.బాలకృష్ణ, బొప్పే ఉమామహేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎమ్ఎన్. రమణ, జి.తరుణ్ పాల్గొన్నారు.

**పరవాడ:** సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ పేరు పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద ఉక్కు రక్షణ బైక్‌యాత్ర పోస్టర్లను సిపిఎం నేతలు ఆదివారం ఆవిష్కరించారు. ఉక్కురక్షణ బైక్‌యాత్ర 27న బుధవారం సాయంత్రం 3.30 గంటలకు పరవాడ సినిమా హాల్ జంక్షన్‌కు, 4 గంటలకి లంకెలపాలెం చేరుతుందని, కార్యక్రమంలో పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పల్లి అప్పారావు, బొడ్డి అప్పలనాయుడు, కన్నూరి నాయుడు, గొర్సుటి శ్రీను, వై చిలుకు నాయుడు, జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం** :విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న ఉక్కురక్షణ బైకుయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం తిమ్మరాజుపేట గ్రామంలో సిపిఎం నేతలు ఆర్ రాము, కర్రి అప్పారావు కరపత్రాలను పంపిణీ చేశారు. 27న అచ్యుతాపురం వస్తున్న బైక్ యాత్రను విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో సిపిఎం తిమ్మరాజుపేట కార్యదర్శి ఎస్ రామ్‌నాయుడు, వెంకట అప్పారావు, ఆడారి విఘ్నేష్, ఎస్ ఆదినారాయణ, నడుపూరు సన్యాసిరావు, కర్రి భాస్కరరావు, పెంటకోట వీరు నాయుడు, కర్రినాగు పాల్గొన్నారు.


పరవాడలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో సిపిఎం నేతలు


తిమ్మరాజుపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నేతలు

# అంగన్వాడీల గృహ నిర్బంధం


కె.కోటపాడులో గృహనిర్బంధంలో అంగన్వాడీ నేత కుమారి


కశింకోటలో పోలీసుల అదుపులో మజ్జి నాగశేషు

**ప్రజాశక్తి- కశింకోట** : ఈనెల 25న తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల చలో విజయవాడ ఆందోళనకు వెళ్లకుండా.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్లు యూనియన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషును కశింకోటలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. తాము శాంతియుతంగా నిరసన చేపడతామని అధికారులకు సమాచారమిచ్చినా అరెస్ట్ చేయడంపై నాగశేషు ఆవేదన వ్యక్తం చేశారు

**కె.కోటపాడు :** అంగన్వాడీల సమస్యలపై ఈనెల 25న చలో విజయవాడ ఆందోళనకు వెళ్లకుండా అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు జి.కుమారిని గృహ నిర్బంధం చేశారు.

**నేతల గృహ నిర్బంధం దారుణం**

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చలో విజయవాడ నిరసనకు వెళుతున్న అంగన్వాడీలను అడ్డుకుని గృహనిర్బంధం చేయడం దారుణమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గండి నాయనబాబు, ప్రజాసంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, సిఐటియు మండల నాయకులు ఇ.నాయుడుబాబు, సిపిఎం మండల నేతలు వానమ్మ, సూర్యనారాయణ ఖండించారు. ఆందోళనకు వెళుతున్న నేతలను హౌస్‌అరెస్ట్ చేయడంతోపాటు పోలీసు కాపలా పెట్టడం, వారితో బలవంతంగా లెటర్లు రాయించుకోవడం దుర్మార్గమన్నారు.

# పలు అభివృద్ధి పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

**ప్రజాశక్తి -అచ్యుతాపురం** : హరిపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆదివారం ప్రారంభించారు. డిజిటల్ లైబ్రరీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదులు, రైతు భరోసా కేంద్రం, పాల సేకరణ కేంద్ర భవనం తదితర పనులను ప్రారంభించారు కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యూ సుకుమార్ వర్మ, గ్రామ సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీ సూర్యనారాయణ, మండలాధ్యక్షురాలు కోన సంధ్య ఎంపిటిసి శరగడం లక్ష్మీ ప్రసన్న, లాభం రాంబాబు, ఎన్ కుమార్, వైసిపి నేతలు కోన బుజ్జి, కే విమలా నాయుడు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు సాయం


సాయం అందజేస్తున్న సర్పంచ్

**ప్రజాశక్తి-అచ్యుతాపురం** : అచ్యుతాపురం శివారు కోణంపాలెం అమూల్ మిల్క్ డెయిరీ పక్కన శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మాజీ సర్పంచ్ బొర్రా అప్పారావు కుటుంబీకులకు చెందిన నాలుగు గుడిసెలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు గ్రామ సర్పంచ్ కె విమలా నాయుడు ఆధ్వర్యంలో తాత్కాలికంగా పాఠశాల ఆవరణలో వసతి సౌకర్యం కల్పించారు. వారి తినడానికి బియ్యం, దుప్పట్లు, చీరలు, బొంతలు తదితర సామగ్రి అందజేశారు. పది రోజుల వరకు భోజనం ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు.. బాధితులకు పరిహారం అందజేయడానికి అధికారులతో మాట్లాడుతానని సర్పంచ్ తెలిపారు.

# హాస్టల్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలి

**ప్రజాశక్తి- చోడవరం** : చోడవరం బిసి బాలుర హాస్టల్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, తరుణ్ డిమాండ్ చేశారు. ఆదివారం హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడిసమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, హాస్టల్‌లో సౌకర్యాలు సరిగా లేవని విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్‌లో చదువుతున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులను సర్కారు చిన్నచూపు చూడడం దారుణమన్నారు. అధికారుల నిర్వహణాలోపం, ప్రభుత్వాలు బడ్జెట్ సరిగా కేటాయించకపోవడం వంటి కారణాలతో హాస్టల్ నిర్వహణ గాడీ తప్పుతోందని, తాము గుర్తించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. అప్పటికీ సమస్యలను పరిష్కరించ కుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గొర్లి తరుణ్, ఎస్ లక్ష్మణరావు, ప్రసాదు, రాము పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

# పర్యాటకంగా బొజ్జన్నకొండ అభివృద్ధి

## వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి


సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న వైసిపి నేతలు

**ప్రజాశక్తి- అనకాపల్లి** : ప్రముఖ బౌద్ధారామ క్షేత్రం బొజ్జన్నకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఆదివారం బొజ్జన్నకొండ వద్ద రూ.7.50 కోట్లతో చేపట్టనున్న బౌద్ధమందరం, కొండ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత నూకాలమ్మ ఆలయాన్ని ఆధునికీకరించే పనులు జరుగు తున్నాయని, ఇపుడు బొజ్జన్నకొండను కూడా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వైసిపి ప్రభుత్వ హయాంలోనే పనులను పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి నేతలు డాక్టర్ విష్ణుమూర్తి, నియోజకవర్గ పరిశీలకులు రత్నాకర్, నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, కొండూరు రవీంద్ర, కొణతాల నీలిమ భాస్కరరావు, వివిధ ఆలయాల చైర్మన్లు పాలకమండలి సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులు ఎత్తేసే వరకూ పోరాటం ఆగదు

**ప్రజాశక్తి- కశింకోట** : టిడిపి అధినేత చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేసే వరకు పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం కశింకోటలో టిడిపి మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతూ, బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైసిపి అకృత్యాలను ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాయల మురళి, ఉగ్గిని రమణమూర్తి, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, కలగా సోమేశ్వరరావు, షేక్ బాబర్, కాండ్రేగుల సతీశ్, ఎంపిటిసి బుదిరెడ్డి అప్పడు, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, జెర్రిపోతుల నూకి నాయుడు, తాకాశి కృష్ణ పాల్గొన్నారు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

# 5న ఢిల్లీలో ఐద్వా బహిరంగ సభ

## విజయవంతానికి కరపత్రాలతో విస్తృత ప్రచారం


కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న ఐద్వా నేతలు

**ప్రజాశక్తి -కశింకోట** : దేశవ్యాప్త మహిళల పోరుయాత్ర ముగింపులో భాగంగా వచ్చేనెల 5న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ఐద్వా బహిరంగసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా నేత డిడి.వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నర్సింగబిల్లిలో ఐద్వా బహిరంగ విజయవంతాన్ని కాంక్షిస్తూ కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 76ఏళ్లు ముగిసినా, నేటికీ మహిళలకు పూర్తిస్వేచ్ఛ రాలేదన్నారు. చంద్రయాన్-3 విజయవంతంలో 55మహిళా శాస్త్రవేత్తలు కీలకపాత్ర పోషించిన ప్రస్తుత పరిస్థితుల్లోనూ అనునిత్యం మహిళలపై వేధింపులు, అత్యాచారయత్నాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి చేపట్టే ఢిల్లీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు వి.శ్యామల, కె.భవాని, వి.రామలక్ష్మి, కె.మణి, టి.దేవి, కె.కుమారి, డి.షర్మిల పాల్గొన్నారు.

# ఘనంగా పశువుల మారెమ్మ పండగ

**ప్రజాశక్తి- కె.కోటపాడు** : మండలంలోని గుండుపాలెం గ్రామంలో ఆదివారం పశువుల మారమ్మ పండగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని పశువులన్నింటినీ ఒక చోట చేర్చి, వాటిపై అక్షింతలు చల్లుతూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ వంటకి శ్రీను, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దగ్గు ఉమాశంకర్ పాల్గొన్నారు.

## ఉద్యమాలపై నిర్బంధం దారుణం

ప్రజాశక్తి- అనకాపల్లి : పెండింగ్ జీతాల చెల్లింపు, మినిమం టైమ్ స్కేల్ అమలు తదితర డిమాండ్లపై సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి ఈనెల 25వ తేదీన విజయవాడలో సత్యాగ్రహ దీక్షకు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలోని గొలుగొండ, చీడికాడ, కె.కోటపాడు తదితర మండలాల్లో పోలీసులు శనివారం నుంచే గృహనిర్బంధాలు, కార్యాలయాల్లో ఫోన్లు తీసుకుని పోలీస్ స్టేషన్లకు రావాలని ఒత్తిడి చేయడం, అక్రమ నిర్బంధాలు, నోటీసులు జారీచేయడం దుర్మార్గమని ఎపి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య అనకాపల్లి జిల్లా కమిటీ జెఎసి చైర్మన్ వివి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, దీనిపై ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలియజేస్తున్న హక్కును హరిస్తూ పోలీసులతో ఉద్యమాల అణచివేత చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిర్బంధకాండ ఆపాలని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంతోపాటు, అరెస్టు చేసిన వారిని వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### వికలాంగుల ఉచిత ఉపకరణాలకు

## 27న చోడవరంలో గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి- చోడవరం : వికలాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీకి అర్హుల గుర్తింపునకు ఈనెల 27న చోడవరం ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్లో గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నారని వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు దుగ్గిరాల రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల వికలాంగులు ముందుగా తమకు ఏ ఉపకరణాలు అవసరమో పేర్లు నమోదుచేసుకుని శిబిరానికి హాజరు కావాలని సూచించారు.

## పసల మారెమ్మ రైతు సంఘం నూతన కమిటీ

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని తోటాడ సెగ్మెంట్లోని రైతుల మూల సంఘమైన పసల మారెమ్మ రైతు సంఘం నూతన కమిటీ ఆదివారం ఏర్పాటైంది. అధ్యక్షులుగా కాండ్రేగుల జగ్గప్పారావు, కార్యదర్శిగా వేగి వెంకట అప్పారావు, కోశాధికారిగా గుమ్మల అప్పారావు, కమిటీ సభ్యులుగా కోయిలాడ మహేష్, కాండ్రేగుల గణేష్‌లను మూల సంఘ రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ రైతాంగ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడంతోపాటు రైతులకు మేలు కలిగే పనులు చేస్తామన్నారు.

## వైసిపి పాలనలో గ్రామాభివృద్ధి గాలికి...

ప్రజాశక్తి- కూనవరం : వైసిపి పాలనలో గ్రామాభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని సిపిఎం జిల్లా నేత మేకల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని రేపాక గ్రామంలో మడకం బొజ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతూ, రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి, ఆదాయసృష్టి కార్యక్రమాలను చేపట్టడం లేదన్నారు. గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లకు రావాల్సిన నిధులను ముఖ్యంగా కేంద్రప్రభుత్వం కేటాయించిన నిధులను దారి మళ్లించి అభివృద్ధిని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ ప్రాంతాలలో డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, ఇతరత్రా మౌలిక వసతులు కల్పన, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కనిపిస్తోంద న్నారు. కార్యక్రమంలో పాయం సీతారామయ్య, స్థానిక సర్పంచ్ మడకం నాగమణి, పాయం జ్యోతి, జోగయ్య, బాబు బొర్రయ్య పాల్గొన్నారు.

## 150 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి, రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, 150మందికి వైద్యసేవలు అందించినటు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. డాక్టర్ జి భాస్కర్, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ డాక్టర్ టివి.సుబ్బారావు పాల్గొని 150 మందికి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 62మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి మందికి ఎక్స్‌రేలు, ముగ్గురికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజి తెలిపినారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ గాధిరాజు వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు, రోగులు, సహాయకులకు ఉచిత భోజనం అందించారు.

# మబ్బులే తప్ప ...
# వర్షించని మేఘాలు

- ఆకాశానికేసి ఆశగా చూస్తున్న రైతన్నలు
- కొనవాడిపోతున్న వరిపైర్లు
- తల్లడిల్లుతున్న అన్నదాతలు



సాగునీరు లేక బీటలు వారిన వరిపొలం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మేఘాలు కమ్ముకుని, చిరుజల్లులు ప్రారంభమైనా, వర్షం కురవకపోవడంతో ఎంతో ఆశగా ఆకాశానికేసి చూస్తున్న బుచ్చయ్యపేట మండల అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మండలంలో ప్రధానంగా వరి సాగు వర్షాధారమే. అక్కడక్కడ ఉన్న వ్యవసాయ బోర్లు, బావులను ఆధారంగా చేసుకుని వరిసాగు అంతంత మాత్రంగానే అవుతుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో పూర్తిస్థాయిలో వర్షాలు కురవ క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడపాదడపా కురిసిన వర్షాలకు వ్యవసాయ మోటార్ల ద్వారా, వ్యవసాయ బావుల్లో నీటిని ఉపయోగించి పలు గ్రామాల్లో అరకొరగా వరినాట్లు వేశారు. దిబిడి, బుచ్చయ్యపేట రాజాం, నీలకంఠాపురం లైపరం తురకలపూడి మల్లాం తదితర గ్రామాలను రైతుల వేసిన వరినాట్లు వర్షాలు లేక కొనవాడిపోతుండడంతో రైతన్నలు తల్లడిల్లిపోతున్నారు. కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పువచ్చి, మబ్బులు కమ్ముకుని చల్లబడుతున్నా, చినుకులు కురిసే పరిస్థితి మాత్రం లేకుండా పోయింది. ఎకరాకు రూ.20 వేల వరకు ప పెట్టుబడి పెట్టి, ఖరీఫ్‌సీజన్లో ఆశావహదృక్పథంలో వరినాట్లు వేసిన రైతన్నలు ప్రకృతి కనికరించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలోని పలుగ్రామాల్లో పంటపొలాలు ఊబాలు జరగక బీడులుగా మిగిలిపోగా, తెగించి వరినాట్లు వేసిన పొలాల్లో సాగునీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

## నేడు జిపిఎస్‌కు వ్యతిరేకంగా ధర్నా : ఫ్యాప్టో



జిపిఎస్ వ్యతిరేక ధర్నాకు పిలుపు ఇస్తున్న ఫ్యాప్టో నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే జిపిఎస్ వ్యతిరేక ధర్నాను జయప్రదంచేయాలని ఫ్యాప్టో నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన ఫ్యాప్టో కార్యవర్గ సమావేశంలో చైర్మన్ గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాతపెంషను విధానం అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుంటే, ప్రభుత్వం జిపిఎస్ అమలుపై నిర్ణయం తీసుకోవడం దుర్మార్గం, ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేయడమేనన్నారు. పెన్షన్ కోసం ఉద్యోగులే చందా చెల్లించే పథకాలు తమకొద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కో-చైర్మన్, కెఎస్ సాయి ప్రసాద్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్. సన్యాసి నాయుడు, సెక్రటరీ సిహెచ్. నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు వి. శ్రీలక్ష్మి, ఎపి సిపిఎస్‌సిఎ జిల్లా ఉపాధ్యక్షులు బోయిన చిన్నారావు, అనకాపల్లి మండల ప్రధాన కార్యదర్శి ఆర్. గౌరినాయుడు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో రాష్ట్రం నాశనం

### టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీష్



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీష్

ప్రజాశక్తి -అనకాపల్లి : పాలకుడు అవినీతిపరుడైతే, నీతిమంతులు జైలుపాలు కాక తప్పదని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, నాలుగున్నరేళ్ల జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసే, అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకొని చంద్రబాబును జైలుపాలు చేశారన్నారు. ఒక్కఛాన్స్ అంటూ ప్రజలను ప్రలోభపెట్టి, అధికారంలోకి వచ్చాక ఇటువంటి నీతిమాలిన చర్యలకు పాల్పడి రాష్ట్రం పరువు తీస్తున్నారని, రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం చేసి శునకానందం పొందుతున్నారని నాగ జగదీష్ మండిపడ్డారు. కార్యక్రమంలో సాలపు నాయుడు, ఆళ్ల రామచంద్రరావు, సూరే సతీష్, మారిశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

## జిపిఎస్‌పై ప్రభుత్వం పునరాలోచించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వం ప్రకటించిన జిపిఎస్ విధానాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేసి, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ, పిఆర్‌టియు రాష్ట్ర నేత గాదె శ్రీనివాసులునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం అనకాపల్లిలో జరిగిన పిఆర్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ,. సిపిఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, పాత పింఛను విధానం అమలు చేయాలన్నదే పిఆర్‌టియు డిమాండ్ అన్నారు. ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేసి జిపిఎస్‌ను అమల్లోకి తేవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పాటైన ఎపి సిపిఎస్ఇఎ సంఘంతో కాకుండా ఇతరులతో మాట్లాడి నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎపి సిపిఎస్ఇఎ సంఘంతోనే ప్రధానంగా చర్చించాలని, అపుడు తీసుకునే అన్ని నిర్ణయాలు, పోరాటాలకు పిఆర్‌టియు మద్దతు ఉంటుందన్నారు. దీనిపై రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను స్వయంగా కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో పాఠశాలల తనిఖీ, ఉపాధ్యాయుల పనితీరు పర్యవేక్షణ విధానాన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు డి గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్ది నాయుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, అన్ని మండల, పట్టణశాఖల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులు నాయుడు

## విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోనిభోంగిరి ఫార్మాసిటీ కాలనీలో వినాయకుని అనుపోత్సవం సందర్భంగా పిల్లలు, మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు ఉపసర్పంచ్ బుగిడి రామగోవింద్ బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో చందక గోవిందరాజు, మేడిశెట్టి అప్పారావు, బుగిడి రమణారావు, దాముర్తి నర్సింగరావు, గొల్లవిల్లి గంగరాజు, ఇరోతి రమేష్, పడాల వెంకటేష్, బుగిడి రామ ప్రభాకర్ రావు. కోమటి కరుణ్ కుమార్, కట్టుమూరి నూకరాజు, కోమటి శ్రీనివాసరావు, అట్టా నూకరాజు మరియు గోవింద్ యువసేన, పోలమాంబ యూత్ సభ్యులు పాల్గొన్నారు

## క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- దేవరాపల్లి: ఈనెల 22 23 తేదీలలో మాడుగులలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో తెనుగుపూడి అంబేద్కర్ గురుకుల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ కెవిఎల్ నరసింగరావు తెలిపారు. అండర్ -14, అండ్ -17 విభాగాలలో ఖోఖో, టెన్నికాయిట్ పోటీల్లో బాలుర జట్టు ప్రథమస్థానంలో నిలిచాయన్నారు. అథ్లెటిక్స్‌లో అండర్ -17 బాలుర 100, 200 మీటర్ల పరుగు పందెంలో పదవ తరగతి విద్యార్థి సిహెచ్ సూర్యకిరణ్ ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించాడు. సిహెచ్ ఈశ్వర్ 200, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించాడు. 1500 మీటర్ల పరుగు పందెంలో ఎల్ సాయి కిరణ్ ప్రథమ స్థానం, అండర్ -14 అథ్లెటిక్స్ విభాగంలో షాట్‌పుట్‌లో 9 వ తరగతి విద్యార్థి జి.గౌరీ మణిశంకర్ ప్రథమ స్థానం, 600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో తతీయ స్థానం సాధించారు. లాంగ్ జంప్ లో జె.మహేష్ ప్రథమ స్థానం సాధించాడు .400 మీటర్ల పరుగు పందెంలో ఆర్. తరుణ్ ప్రథమస్థానంలో నిలిచాడు. క్రీడల్లో విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పిఇటిలు జి తరుణేశ్వరరావు, ఎస్. నాగేశ్వరరావులతోపాటు, ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ కెవిఎల్ నర్సింగరావు, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ రవీంద్రనాథ్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో గురుకులం ప్రిన్సిపల్, సిబ్బంది

### జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఐదుగురు ఎంపిక

కె.కోటపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు పి.లక్ష్మి తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీల్లో అండర్-14విభాగంలో అథ్లెటిక్స్‌లో ప్రవీణ్, కబడ్డీలో సాగర్, ఖోఖోలో జె.హారిక ఎంపిక కాగా, అండర్ 17 విభాగంలో జి.అనిత, పి.భువనేశ్వరి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం ఎస్‌వి.పద్మావతి అభినందించారు.

# వైసిపిలో ముసలం

## -తారాస్థాయికి చేరుకున్న గ్రూపు రాజకీయాలు -మండల అధ్యక్షుని పేరు మార్పుతో విభేదాలు

**ప్రజాశక్తి- కోటవురట్ల:**మండల వైసీపీలో అధ్యక్షుని మార్పుతో గ్రూపు రాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీలో ముసలం మొదలైంది. ఇటీవల మండల వైసిపి అధ్యక్షుని మార్పుతో విభేదాలకు తెర లేపాయి. గడచిన 8 నెలలుగా మండల వైసీపీ అధ్యక్షున్ని ఎన్నుకోకపోవడం, ఇదే క్రమంలో పాములవాక గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కిల్లాడ శ్రీనివాసరావు పేరు పార్టీ అధిష్టానానికి స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు సూచించారు. మండల వ్యాప్తంగా కూడా శ్రీనివాసరావును అధ్యక్షునిగా అంతా అనుకున్నారు. అనూహ్యంగా గతంలో మండల వైసిపి అధ్యక్షునిగా చేసిన వెంకటాపురం గ్రామానికి చెందిన పైల రమేష్



తిరిగి నియమించడంతో ఒక్కసారిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ముసలం మొదలైంది. పైల రమేష్ నియామకం మంత్రి గుడివాడ అమర్నాథ్ అండ దండలతోనే జరిగిందని చర్చించుకుంటున్నారు. ఈ విషయం వైవి సుబ్బారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లేందుకు మరో వర్గం సిద్ధం అవుతోంది. వివాద రహితుడు శ్రీనివాసరావు పేరు ప్రకటించి తొలగించడం పట్ల పలు గ్రామాలకు చెందిన వైసిపి నాయకులే ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మండలంలో గ్రూపు రాజకీయాల కారణంగా కార్యకర్తలు అయోమయం నెలకొంటుంది. ఇలాంటి మార్పులతో తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయని, దీంతో పార్టీలో ముసలం తప్పదని సీనియర్ నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్ రాజకీయాలతో అభివృద్ధి కుంటుపడిందని పలువురు తెలిపారు. మండల వైసీపీ నేతలను సమన్వయ పరచాల్సిన జిల్లా నాయకులే తగాదాలకు ఆజ్యం పోస్తున్నారని సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# టిడిపి నేతల నిరసనలు



విశాఖలో జల దీక్ష చేస్తున్న నాయకులు

**భీమునిపట్నం :** చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ స్థానిక టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం నాటికి 15వ రోజుకు చేరాయి. కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, ఆనందపురం మండలం నాయకులు పాల్గొన్నారు.

**గాజువాక :** పాత గాజువాకలో టిడిపి చేస్తున్న నిరసన దీక్షకు జనసేన, సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు, సిపిఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్, టిడిపి కార్పొరేటర్లు బొండా జగన్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, పులి వెంకటరమణారెడ్డి, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, జనసేన కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు గడసల అప్పారావు, గంధం వెంకట్రావు, సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.


**పెందుర్తి :** 94వ వార్డు వేపగుంట కూడలి వద్ద జనసేన, టిడిపి నాయకుల రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, బల్ల శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, శానాపతి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

**సింహాచలం:** సింహాచలంలో టిడిపి వార్డు అధ్యక్షుడు పంచదార శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం కాగడాల ప్రదర్శనను తలపెట్టారు. వీరి ప్రయత్నాన్ని గోపాలపట్నం పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను హౌస్ అరెస్టు చేశారు.

**యలమంచిలి :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా యలమంచిలి మెయిన్‌రోడ్డుపై చేపట్టిన రిలేనిరాహార దీక్ష శిబిరంలో కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కొలుకులూరి విజయబాబు, రాజాన సూర్యనాగేశ్వరరావు, నారాయణమ్మ, రాష్ట్ర శెట్టిబలిజ సాధికార కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, యాత కన్వీనర్ వనుము శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాండురంగ, ఇత్తంశెట్టి రాజు, గొర్లె నానాజీ, రమణబాబు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, జనసేన రాజాన సోమునాయుడు, యాంద్రఅప్పలనాయుడు, కుందిరి అప్పలరాజు, కర్రి రమణ, నోట్ల అప్పలనాయుడు, కరణం రవి, రమణబాబు పాల్గొన్నారు.



భీమిలిలో..



యలమంచిలిలో...

**ఎంవిపి.కాలనీ :** 19వ వార్డు పెద జాలారిపేట కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, బైరెడ్డి పోతన్నల ఆధ్వర్యంలో మత్స్యకారులు సముద్రంలో బోట్లుపై వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకుడు జివి.రామచంద్రరావు, తెడ్డు రాజు, దోడ చిరంజీవి, పిల్లా నూకన్న, ఒలిశెట్టి చిన ఎల్లయ్య, ఒలిశెట్టి సత్యారావు పాల్గొన్నారు.

**టిడిపి నాయకుల అరెస్ట్**

**విశాఖ కలెక్టరేట్ :** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తెలుగు యువత ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష ఉద్రిక్తతకు దారితీసింది. దీక్ష ముగిసే సమయానికి అక్కడకు చేరుకున్న పోలీసులు కార్యకర్తలను అరెస్టు చేశారు. దీంతో ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును పోలీసులు హరిస్తున్నారంటూ నేతలు మండిపడ్డారు. సాయంత్రం బీచ్ రోడ్డులో తలపెట్టిన తెలుగు మహిళల నారీ భేరికి హాజరైన పలువురిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ బ్యారెక్స్ వద్దకు తరలించారు. అరెస్టయిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్, కార్యదర్శి లొడగల కృష్ణ ఉన్నారు. అరెస్టులకు ముందు నిరాహార దీక్షా శిబిరంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ మాట్లాడారు.

# స్నేహితుల ఆపన్న హస్తం

### రూ.40 వేల నగదు అందజేత

**ప్రజాశక్తి- కొత్తకోట:**రావికమతం మండలం కొత్తకోటకు చెందిన పలువురు స్నేహితులు తమ ఉదారతను చాటుకున్నారు. తన స్నేహితుడు పడమటి శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరడం, అదే విధంగా అతడి అమ్మ అనారోగ్యం పాలు కావడంతో అతడి పరిస్థితి దయనీయంగా మారింది. శ్రీనివాసరావు పరిస్థితిని గుడాల గంగాధర్ తన సహచర స్నేహితులకు చెప్పడంతో వారంతా తమకు తోచిన విధంగా నగదను సమకూర్చారు. ఈ విధంగా సమకూర్చిన రూ. 40వేలను పడమటి శ్రీనివాసరావుకు ఆదివారం స్నేహితులు అంతా కలిసి అందజేశారు. ఆపదలో ఆర్థిక సహాయం చేసిన స్నేహితులు అందరికీ గంగాధర్ కృతజ్ఞతలు తెలియజేశారు.



రూ.40 వేల నగదును అందజేస్తున్న గంగాధర్, మహేష్, ప్రసాద్,



విరాళం అందజేస్తున్న నాయకులు

## ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి- చీడికాడ:**మండలంలోని చిన్న కోణం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకులు రాయపరెడ్డి కృష్ణ రూ. 10 వేలను అందజేశారు. జనసేన నాయకులు అప్పారావు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ కమిటీకి రాయప రెడ్డి కృష్ణ పది వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మురికితి అప్పారావు, యాళ్ల ప్రసాద్, వరహాలునాయుడు, పరదేశి నాయుడు, అప్పారావు, అప్పలకొండ శ్రీను, సంతోష్, కార్తీక్, పోతురాజు పాల్గొన్నారు.



పఠనం చేస్తున్న విద్యార్థులు

## నిరంతర పఠనంతో విజ్ఞానం

**ప్రజాశక్తి-గొలుగొండ:**స్థానిక శాఖ గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి రాజబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ బాలుర హాస్టల్ నుండి 16 మంది విద్యార్థులతో కథల పుస్తకాలు, మహనీయుల జీవిత చరిత్రలు, వైజ్ఞానిక విశేషాలు చదివించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు నిరంతరం పఠనం చేయడంతో అనేక విషయాలను అవగాహన చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

## ఘనంగా వెంకన్న ఊరేగింపు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైబోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుణ్యకోటి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి సేవ నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం తిరు వీధి సేవ నిర్వహించారు .పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, నందూరి రాజ గోపాలాచార్యులు, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, దవరసింగి సన్యాసిరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు .



ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న ఎస్‌పి

## కానిస్టేబుల్ వెంకటరావుకు అవార్డు

**ప్రజాశక్తి-కోటవురట్ల:** మండలంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పి.వెంకటరావు సేవలకు గాను జిల్లా ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇటీవల నక్కపల్లి మండలంలో సచివాలయ సిబ్బంది అపహరించిన 14 లక్షలు పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించడం, అక్రమ మద్యం విక్రయాలు, నాటు సారా తయారీ, శిబిరాల ధ్వంసం పట్ల వెంకట్రావు కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, ఎస్పీ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్థానిక ఎస్సై నారాయణరావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## మహిళలకు ప్రభుత్వం పెద్ద పీట

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం:** రాష్ట్రంలో మహిళలకు రానున్న రోజుల్లో మహిళా రిజర్వేషన్ అంశంలో మరింత పెద్దపీట వేయనున్నట్లు రాష్ట్ర యస్‌సి కార్పోరేషన్ చైర్ పర్సన్ పెదపాటి అమ్మాజీ అన్నారు. ఆదివారం అడ్డరోడ్డులో తన నివాసం వద్ద స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ, మహిళా బిల్లు ఆమోదానికి ఒప్పుకున్న ప్రతిపక్ష పార్టీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మన రాష్ట్రంలో 2019 లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళలకు 50శాతం రిజర్వేషన్లను నామినేటెడ్ పోస్టుల్లోను, పదవులలోను అమలు చేయడం అభినందనీయమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలలో మహిళలకే అగ్రస్థానం కల్పించారని తెలిపారు.



మాట్లాడుతున్న అమ్మాజీ

## ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి- పెదబయలు రూరల్:** గిరిజనుడుపై దాడి పాల్పడిన సబ్ ఇన్స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ ఆదికార. రాష్ట్రీయ మంచ్ సభ్యురాలు. తలాబు కొసల్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిని. ధర్మాన పడల్ డిమాండ్ చేశారు. బాధితుడు స్వగ్రామమైన మొండికోట గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ, ఆదివాసి ప్రాంతంలో పోలీసులు తప్పు చేసినా చర్యలు తీసుకోకుండా ఏదైనా కొత్త చట్టం తెచ్చారా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన జరిగి పది రోజులు అవుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోపోవడం చూస్తుంటే గిరిజన ప్రాంతాల్లో గిరిజన హక్కులు, చట్టాలు అమలు కాలేదన్నారు.

### ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలో..

# పార్కింగ్ పేరిట దోపిడీ

### -పట్టించుకోని రవాణా శాఖ అధికారులు



**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆర్టీసీ డిపార్ట్మెంట్ ఆక్షన్ ద్వారా ఏర్పాటు చేసిన వాహన పార్కింగ్ లో అడ్డు అదుపు లేకుండా అక్రమ వసూళ్లు చేస్తున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఏజెన్సీ ముఖద్వారం కావడంతో కొయ్యూరు, ఏలేశ్వరం, చింతపల్లి, తదితర ప్రాంతాల నుండి నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని పార్కింగ్ సెంటర్‌లో వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. ద్విచక్ర వాహనాలు 12 గంటల పాటు పార్కింగ్ చేసినట్టయితే రూ.15లు వసూలు చేయాల్సి ఉంది.ఒక రోజు కు 24 గంటలు ఇక్కడ పార్కింగ్ చేస్తే వందల రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు 12 గంటల పాటు పార్కింగ్ చేసినట్టయితే రూ.15లు వసూలు చేయాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా 30 నుండి 50 రూపాయలు వసూలు చేస్తున్నారు. 24 గంటలపాటు ఉంచితే సుమారు రూ.100 వరకూ వసూళ్లు చేస్తున్నారు. ధరల పట్టికను ప్రదర్శించాల్సి ఉంది కానీ ధరల పట్టిక ఏర్పాటు చేయలేదు. పార్కింగ్ ప్రదేశంలో ఎండ, వాన నుండి వాహనాలకు రక్షణ లేకుండా పోయింది. ఈ విషయం ఇప్పటికే పలువురు వాహనదారులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతో అధికారులు రెండుసార్లు గుత్తేదారునికి నోటీసులు ఇవ్వడం జరిగింది. అయినప్పటికీ గుత్తేదారునిలో మార్పు రాలేదు. ఆర్టీసీ నిర్ణయించిన పార్కింగ్ ఫీజులను తగ్గించమని వాహనదారులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. పార్కింగ్ నిర్వాహకులు పట్టించుకోలేదు. పార్కింగ్ చేసే సమయంలో నిర్దేశించిన ధర కంటే అధికంగా వసూలు చేస్తుండడంతో వాహనదారులు తరచూ గొడవకు దిగుతుంటారు. సంబంధిత నిర్వాహకులు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ పార్కింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు.

### ఇష్ట మొచ్చినట్లు వసూలు

నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్సుకు నిత్యం ప్రయాణీ కులు వస్తూ పోతుంటారు. ఆర్టీసీ కాంప్లెక్సు ప్రార్కింగ్‌లో నిర్దిష్టమైన చార్జీలు ఉండలేదు. ఇష్టమొచ్చినట్లు వసూలు చేస్తున్నారు. కాంప్లెక్స్ లో ప్యాన్లు ప్రయాణికులకు సరిపడా లేవు, ఉన్న ఫ్యానుకు పనిచేయవు.

**అడిగర్ల రాజు**
**సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు**

### రెండు సార్లు నోటీసులు పంపాం

ఈ విషయం తమ దృష్టికి వచ్చినప్పుడు రెండు సార్లు నోటీసులు పంపించాము ఇప్పటికీ గుత్తేదారునిలో మార్పు రాకపోయినట్లయితే నిర్వహణ రద్దు చేస్తాం.

**ఎస్.సన్యాసినాయుడు**
**ఆర్టిసి సిఐ**

# సిపిఎం ఉక్కు సంకల్పం

### -నేడు అల్లూరి జిల్లా అనంతగిరికి రానున్న బైక్ ర్యాలీ
### -జిల్లాలో రెండు రోజుల పాటు సాగనున్న జాతా



బైక్ యాత్ర చేపడుతున్న సిపిఎం నేతలు (ఫైల్ ఫొటో)

**ప్రజాశక్తి-పాడేరుటౌన్, పాడేరు:** విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో తెలుగువారి ఉద్యమ ఫలితంగా ఏర్పడింది. తెలుగు ప్రజలు పోరాడి 32 మంది ప్రాణ త్యాగాలతో, 16 వేల మంది రైతుల త్యాగఫలంగా స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకున్నారు. అప్పటి నుంచి దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ నాణ్యమైన ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచింది. అలాంటి సంస్థను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అమ్మేయాలని మోడీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఉక్కు కర్మాగారం ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రధాన ప్రభుత్వ రంగ యూనిట్. దాని ప్రైవేటీకరణ రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్రమైన హానిని తలపెట్టడమే. దీనిని కాపాడుకోవడానికి ఉద్యోగులు, కార్మికులు దీర్ఘకాలంగా ఉద్యమిస్తున్నారు. అయినా మోడీ ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల ఉద్యమాన్ని కనీసం పట్టించుకోలేదు. ప్రైవేటు పరం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ ఉక్కు ఉత్పత్తి సామర్ధ్యానికి అడ్డంకులను సృష్టిస్తూ పరిశ్రమకు నష్టాలు కలిగేలా వ్యవహరిస్తోంది. ఇదే జరిగితే అందులో పని చేస్తున్న సుమారు 3,500 మంది ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోల్పోతారు. భవిష్యత్తులోనూ గిరిజన ప్రాంతాల నుంచి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఉండవు. ఉక్కు ప్రైవేటీకరణ జరిగితే గిరిజన యువత ఉద్యోగ రిజర్వేషన్ కోల్పోతామని ఆవేదన చెందుతున్నారు. అలాగే స్టీల్ ప్లాంట్ లో జిల్లాకు చెందిన వందలాది మంది పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్ ను కాపాడుకోవడం రాష్ట్ర ప్రజల బాధ్యత.

**సిపిఎం బైక్ యాత్ర**

విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించుకునేందుకు సిపిఎం చేస్తున్న పోరాటాల్లో భాగంగా విశాఖలో ఈనెల 20న ప్రారంభమైన బైక్ యాత్ర 25న సోమవారం అల్లూరి జిల్లా అనంతగిరి మండలానికి చేరుకోనుంది. మండలంలోని కాశీపట్నంలో ఉదయం 11:30 గంటలకు చేరుకుంటుంది. అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్ధులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:30 గంటలకు అరకు వేలి చేరుకోనుంది. అది మధ్యాహ్నం భోజనం అనంతరం ఐటిఐ డిగ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులతో నాయకులు మాట్లాడుతారు. అక్కడ నుంచి డుంబ్రిగూడ, హుకుంపేట మండలాల మీదుగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు 4:30 గంటలకు చేరుకుంటుంది. పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో మాట్లాడతారు. రాత్రి పాడేరులో బస చేయనున్నారు. 26వ తేదీ ఉదయం జి.మాడుగుల మండల కేంద్రంలో అల్పాహారం తీసుకుంటారు. ఉదయం 10 గంటలకు చింతపల్లి మండలంలో చేరుకుంటారు. అక్కడ నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడ నుంచి సాయంత్రం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చేరుకోనున్నారు. బైక్ ర్యాలీలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అయిన నేపథ్యం, ఉత్తరాంధ్ర ఆర్థిక అభివృద్ధిలో అవసరం, ప్రైవేటీకరణకు కేంద్ర అనుసరిస్తున్న దుర్మార్గ విధానాలు, రాష్ట్రంలో పాలక, ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు, యువతకు వివరించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడు తుండటంతో విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోనూ ర్యాలీ సాగనుంది.

# పట్టాలిచ్చారు.. స్థలం మరిచారు...

**ప్రజాశక్తి-కోటవురట్ల:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గృహాలు నిర్మిస్తుందంటూ ఉదర కొడుతున్న అధికారులు, నాయకులు ఆచరణలో మాత్రం శూన్యంగానే కనిపిస్తుంది. జగనన్న కాలనీ ఇల్లు నిర్మాణాలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. ఎండపల్లి గ్రామానికి చెందిన రావాడ సత్యవతి, పాడిశెట్టి వరహాలమ్మకు పట్టాలు ఇచ్చి నాలుగు సంవత్సరాలు అయినా స్థలం చూపలేదు. స్థలం చూపాలని నాలుగు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నామని, జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో సైతం సమస్యను విన్నవించుకున్నా ఎవరు పట్టించుకోలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్లైన్లో స్థలం ఇచ్చినట్లు చూపిస్తున్నా అధికారులు స్థలం చూపించక పోవడంతో దిక్కు తోచని స్థితిలో ఏమి చేయాలో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు. మండలానికి చెందిన పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.ఇటీవల కోటవురట్లలో జరిగిన జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో హౌసింగ్ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. ఎండపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ప్రైవేటు వ్యక్తి ప్రైవేట్ లే అవుట్ వేసినా పట్టించుకోలేదని ఈ సందర్భంగా పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, హౌసింగ్ అధికారులు సమస్యను పరిష్కరించి తమకు ఇళ్ల స్థలాలు చూపించాలని లబ్దిదారులు కోరుతున్నారు.

### నాలుగేళ్లు అవుతున్నా..

పట్టా లిచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తవుతుంది. నేటికీ ఇంటి స్థలం అధికారులు చూపించక పోవడం అన్యాయం. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. అధికారులు పట్టించుకోక పోవడంతో ఏమి చేయాలో తెలియలేదు. ఇకనైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి స్థలం చూపాలి



**రావాడ సత్యవతి**
**ఎండపల్లి**

### కాళ్లరిగేలా తిరుగుతున్నా..

అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదు. కలెక్టర్ కార్యాలయానికి కూడా ఫిర్యాదు చేసినా ఎవరో పట్టించుకోలేదు. పట్టాలు ఇచ్చారు కానీ స్థలం చూపించలేదు. ఇల్లు లేక అవస్థలు పడుతున్నాం. అధికారులకు పలు మార్లు తెలిపాం. అధికారులు స్థలాన్ని చూపాలి.



**పాడిశెట్టి వరహాలమ్మ**
**ఎండపల్లి**